# సీఎం కేసీఆర్ పాలనలో ఇంటింటా సంక్షేమం

- **బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం**
- **డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్**

చిన్నగూడూరు, అక్టోబర్ 17: స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఎన్నికల్లో మళ్లీ హ్యాట్రిక్ విజయం సాధించి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం తథ్యమని, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని ఉగ్గంపల్లిలో పలు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, వివిధ సంఘాల బాధ్యులు మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ..కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందిస్తున్నదని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపానని, ప్రజల ఆశీస్సులతో మరోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ డోర్నకల్ మండల అధ్యక్షుడు నున్న రమణ, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ భిక్షంరెడ్డి, నాయకులు రాము, సుజాత, వెంకన్న, శ్రీనివాస్, లతీఫ్, హబీబుద్దీన్, మక్సూద్, లలిత, హుస్సేన్, వస్రాం, గోల్కొండ వెంకన్న వీరన్న, ప్రశాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘాల నాయకులు

**సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి**

చిన్నగూడూరు: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల సోషల్‌మీడియా బాధ్యులు ఉగ్గంపల్లిలో మంగళవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి ఐడెంటీ కార్డులు అందించి మాట్లాడారు. ప్రభుత్వంపై విపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. గ్రామాల్లో జరిగే సభలు, సమావేశాల సమాచారాన్ని ప్రతి కార్యకర్తకు అందించేలా చూడాలన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన పలువురు ప్రముఖులను ఎమ్మెల్యే కలిశారు. కార్యక్రమాల్లో నాయకులు రాంసింగ్, ధారాసింగ్ చెన్నయ్య, జనార్దన్, సోషల్‌మీడియా బాధ్యులు సురేశ్, జోసఫ్, శ్రీను, చిరంజీవి ఉన్నారు.


మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్‌రావు

## గెలుపు ఖాయం.. మెజార్టీయే లక్ష్యం

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్‌రావు**

మరిపెడ, అక్టోబర్ 17: సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సుభిక్షమైన పాలన అందిస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వం మరోమారు హ్యాట్రిక్ సాధిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన‌రావు అన్నారు. మంగళవారం మున్సిపల్ కేంద్రంలో బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వృద్ధాప్యం, ఒంటరి మహిళ, వితంతువులకు రూ.5016 ఆసరా పింఛన్, దివ్యాంగులకు రూ.6016 దశలవారీగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పంట పెట్టుబడుల కోసం అందిస్తున్న రైతుబంధు సైతం రూ.16వేలు అందిస్తామని సీఎం కేసీఆర్ తెలిపారన్నారు. అన్నపూర్ణ పథకం కింద రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం, అర్హులకు రూ.400కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని మేనిఫెస్టోలో పొందుపర్చారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిధి రూ.15లక్షల వరకు పెంచారని, దీంతో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలోనే తెలంగాణ సుస్థిరమైన ప్రగతి సాధిస్తుందన్నారు. మతతత్వ బీజేపీ వల్ల రాష్ట్రంలో అశాంతి నెలకొంటుందని, వర్గపోరు కలిగిన కాంగ్రెస్ వస్తే తెలంగాణ ఢిల్లీ గులాముల చేతుల్లోకి వెళ్తుందన్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రతి గిరిజన తండాకు తారురోడ్డు, మెరుగైన మౌలిక వసతులు కల్పించి నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలిపినట్లు వివరించారు. స్థానికేతర నేతలకు ఇక్కడ స్థానం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తోడ్పాటుతో ఎమ్మెల్యే రెడ్యానాయక్ పట్టణంలో రూ.36కోట్లతో వంద పడకల దవాఖాన, రూ.60కోట్లతో సుందరమైన మున్సిపల్ కేంద్రం, రూ.43కోట్లతో ఆకేరువాగుపై మూడు చెక్‌డ్యాంలతో పాటు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. రెడ్యానాయక్ గెలుపు ఖాయమైందని, మెజార్టీయే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ సింధూరాకుమారి, వైస్‌చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, రైతు బంధు సమితి సభ్యులు పానుగోత్ వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ లతీఫ్, ఏ ఉపేందర్, కోఆప్షన్ సభ్యులు మక్సూద్, కేలోత్ శ్రీను పాల్గొన్నారు.


కురవి: షోయబుల్లాఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సురేశ్

## షోయబుల్లాఖాన్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మహబూబాబాద్, అక్టోబర్ 17: షోయబుల్లాఖాన్ ఆశయాలకు అనుగుణంగా జర్నలిస్టులు పని చేయాలని టీయూడబ్ల్యూ(ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వికాస్ కాలేజీ ఆవరణలో షోయబుల్లాఖాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, నాయకులు ముఖేశ్, ఉమ్మగాని మధు, చందా శ్రీనివాస్, గుండోజు శ్రీనివాసాచారి, మలిశెట్టి వేణు, అశోక్‌బాబు, విజయ్, గిరి పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలో అక్షరయోధుడు షోయబుల్లాఖాన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద గుంటి సురేశ్ షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సహదేవ్, వీరన్న, రోషయ్య, నాగరాజు, బాలు, ప్రమోద్ పాల్గొన్నారు.

గార్ల: మండల కేంద్రంలోని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో షోయబుల్లాఖాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ బుడాన్, రావూరి ప్రశాంత్, తోడేటి రాము, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామికి కిరీటం, నాగాభరణం బహూకరణ

దంతాలపల్లి, అక్టోబర్ 17: మండలంలోని పెద్దముప్పారం గ్రామంలో పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి గ్రామానికి చెందిన దాతలు బండి చంద్రశేఖర్, బండి చిరంజీవి వారి తండ్రులు వెంగళయ్య, యాదగిరి జ్ఞాపకార్థం ఇత్తడితో చేయించిన కిరీటం, నాగాభరణాన్ని బహూకరించారు. మంగళవారం అర్చకులు పోలంపల్లి రమణశర్మ, పవన్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి కిరీటం, నాగభరణాన్ని స్వామివారికి అలంకరించారు.

## బీజేపీ, కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టాలి

**యువనేత డీఎస్ రవిచంద్ర**

మరిపెడ, అక్టోబర్ 17: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, పథకాలు తామే చేసినట్లు బీజేపీ నేతలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని, వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలని బీఆర్ఎస్ యువనేత, రైస్‌మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లంపేటలో డోర్నకల్ నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులను యూపీ సీఎం యోగి తమ రాష్ట్రంలో చేసినట్లు సోషల్ మీడియాలో పోస్టులు చేయడం సరికాదన్నారు. ఎన్నికల ప్రచారం మొదలు ఓటింగ్ వరకు వివిధ దశల్లో విపక్షాలు చేసే విన్యాసాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆర్ పాలన శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. డోర్నకల్ నియోజకవర్గంలో పార్టీలకతీతంగా సంక్షేమ, అభివృద్ధి అందించే సమర్థవంతమైన నేత ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కేసీఆర్ సంక్షేమ పథకాలు జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవిచంద్ర

## అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సాయి ప్రియాంక



గార్ల, అక్టోబర్ 17: మండల కేంద్రంలోని బెస్తాబజారుకు చెందిన పగడాల సాయి ప్రియాంక జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎంపికయ్యారు. ఇటీవల సాయి ప్రియాంక ఢిల్లీ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్‌లో డాక్టరేట్ పొందింది. ఈ సందర్భంగా ఎంపీపీ మూడు శివాజీ చౌహాన్ , ఎంపీటీసీలు శీలంశెట్టి రమేశ్, సుజాత, పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ఎంపీఓ రవీందర్, ఎస్సై బానోత్ వెంకన్న అభినందించారు.

## నెల్లికుదురులో 13 మంది బైండోవర్

నెల్లికుదురు: ఎన్నికల నిబంధనల ప్రకారం వివిధ పార్టీలకు చెందిన 13 మంది కార్యకర్తలను బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ రాజు తెలిపారు. కార్యాలయంలోని చాంబర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, గత ఎన్నికల రికార్డుల్లోని వ్యక్తులు 13 మందిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

## నిషేధిత వస్తువులు అమ్మినా, కొన్నా కఠిన చర్యలు

- **సీఐలు రాజు, భాస్కర్‌రావు**
- **దుమ్మాతండాలో పోలీసుల కార్డన్ సెర్చ్**
- **3వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం, 50 లీటర్ల గుడుంబా సీజ్**

చిన్నగూడూరు, అక్టోబర్ 17: ప్రభుత్వ నిషేధిత వస్తువులు అమ్మినా, కొనుగోలు చేసినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని సీఐలు రాజు, భాస్కర్‌రావు హెచ్చరించారు. మండలంలోని ఉగ్గంపల్లి శివారు దుమ్మాతండా, బంకతండాల్లో సివిల్, ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో మంగళవా రం జాయింట్ రైడ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు చేపట్టి పలువురు గిరిజనుల ఇండ్లలో సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం పానకం, గుడుంబాను పట్టుకున్నారు. పలువురిపై కేసులు నమోదు చేసి, మరి కొందరిని బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బెల్లం, గుడుంబా వంటి నిషేధిత వస్తువులపై నిఘా పెంచి కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో 3వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, 50లీటర్ల గుడుంబాను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

**నల్లబెల్లం, పటిక స్వాధీనం**

నెల్లికుదురు: అక్రమంగా తరలిస్తున్న రూ. 75వేల విలువైన 5.50 క్వింటాళ్ల నల్లబెల్లం, 2.50 క్వింటాళ్ల పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కే క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూరు మండలం హెచ్ తండాకు చెందిన బానోత్ ప్రవీణ్ కారులో 10 బస్తాల్లో 5.50 క్వింటాళ్ల నల్లబెల్లం, 5 బస్తాల్లో 2.50 క్వింటాళ్ల పటికను తరలిస్తుస్తూ నెల్లికుదురు శివారు ప్రాంతంలో పోలీసులకు పట్టుబడ్డాడు. సంబంధిత బెల్లం, పటికను స్వాధీనం చేసుకొని, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. అక్రమంగా బెల్లం, పటికను రవాణా చేస్తున్న బానోత్ ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


చిన్నగూడూరు: బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

## 'జాతీయస్థాయి ఖోఖో'కు పండు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయుడు మోహన్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 17: పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 13 నుంచి 16 వరకు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ఇండియా) అండర్ -17 బాలుర ఖోఖో క్రీడలు నిర్వహించారు. మండలంలోని రెడ్యాల ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జే పండు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కెప్టెన్‌గా వ్యవహరించి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు మోహన్ నాయక్ తెలిపారు. పండును ఉపాధ్యాయులు అభినందించారు.

## వాహనాల తనిఖీ

డోర్నకల్, అక్టోబర్ 17: ఎన్నికల కోడ్ దృష్ట్యా డోర్నకల్ ఎస్సీ, బీసీ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్ పోస్టును ఏఎస్సై చెన్నయ్య మంగళవారం పరిశీలించారు. పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి, వాహనాలను విస్తృతంగా తనిఖీ చేయాలన్నారు. అదే విధంగా ఎక్సైజ్ సీఐ చిరంజీవి,ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్ ఎస్ఎస్‌టీ చెక్ పోస్టును పరిశీలించారు.